ప్రజాశక్తి
సోమవారం 11 నవంబర్ 2024
5
పార్వతీపురం మన్యం

శ్రీరంజనికి రాష్ట్ర స్థాయి అవార్డు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయ ప్రిన్సిపల్ సిహెచ్ శ్రీరంజని రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యాభివృద్ధి, విద్యార్థుల ఉత్తమ ఫలితాల సాధనకు తీర్చిదిద్దడంలో ఆమె చేసిన కృషిని గుర్తించిన ప్రభుత్వం ఆమెకు అవార్డును ప్రకటించింది. దీంతో శ్రీరంజనిని గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ గౌరీశంకరరావు, గ్రామస్తులు అభినందించారు.

ప్రిన్సిపల్ శ్రీరంజని

మన్యం జిల్లా ఏర్పడి రెండున్నరేళ్లు కావస్తున్నా ఇంకా పురిటినొప్పులతోనే సతమతమ వుతోంది. జిల్లా అభివృద్ధికి అనేక బాలారిష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. చిన్న జిల్లా చింతల్లేని జిల్లా.. అని ఇటీవల మన్యం జిల్లాకి చెందిన మంత్రి సంధ్యారాణి చెప్పారు. కానీ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన జిల్లాలలో దేనికీ లేని చింతలు మన్యం జిల్లాకే ఉన్నాయనిపిస్తోంది. నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు, 15 మండలాలతో ఆవిర్భవించిన జిల్లా ప్రగతి మూడు అడుగుల ముందుకు.. ఆరడుగుల వెనక్కి అన్న చందంగా తయారైంది.

అధికారులు కావలెను

- జిల్లాను వెంటాడుతున్న ఇన్‌ఛార్జుల పాలన
- బదిలీపై రావడానికి మొహం చాటేస్తున్న వైనం
- సబ్‌కలెక్టర్‌కు 5 శాఖల బాధ్యతలు
- సవ్యసాచిలా విధులు నిర్వహిస్తున్న యువ ఐఎఎస్ అధికారి

ప్రజాశక్తి-పార్వతీపురం

2022 ఏప్రిల్ 4న పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైంది. అప్పటికే కొత్తగా నిర్మించిన ఐటిడిఎ ప్రాజెక్టు కార్యాలయ భవనం సిద్ధంగా ఉండడంతో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని దానిలో ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్‌పి కార్యాలయాన్ని వైటిసి భవనంలో ఏర్పాటు చేశారు. జిల్లాలో ఇతర శాఖలకు కార్యాలయాలన్నీ అద్దె కొంపల్లోనే కొనసాగుతున్నాయి. నెల నెలా అద్దెల కింద రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది రూపాయలను చెల్లిస్తోంది. జిల్లా అంటే దాదాపు 50కి పైగా శాఖల సమూహం. కార్యాలయాలంటే ఏదో ఒక అద్దె కొంప వెతికి అక్కడ పెట్టేస్తారు. కానీ ఆ శాఖలకు అధికారులను మాత్రం అద్దెకు తీసుకురాలేని పరిస్థితి ఉంది. అత్యంత వెనుకబడిన జిల్లాగా ముద్రపడిన మన్యం జిల్లాని అధికారుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనుల పురోగమనానికి ఇది ప్రతిబంధకంగా మారుతోంది. ఇక్కడ పని చేస్తున్న జిల్లా కలెక్టర్‌కు పరిపాలన కత్తిమీద సాములా ఉంది. ఒక అధికారి రెండు శాఖల వరకు బాధ్యతలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది. కానీ మూడు, నాలుగు, ఐదు శాఖల బాధ్యతలు నిర్వహించాలంటే తలకు మించిన భారమే అవుతుంది. దీని వల్ల కీలకమైన శాఖలలో పనులు మందగించి ఆశించిన ఫలితాలు రాని పరిస్థితి కనిపిస్తోంది. ఈ జిల్లాలో గత కొంతకాలంగా అలాంటి పరిస్థితే దాపురించింది. బహుశా కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో ఎక్కడా లేని విచిత్ర పరిస్థితి ఇక్కడే ఉందేమో అనిపిస్తోంది.

బదిలీలపై రావడానికి ఇష్టపడని అధికారులు

రాష్ట్రంలో మూలన ఉన్న మన్యం జిల్లాకి బదిలీలపై రావడానికి అధికారులెవరూ ఇష్టపడడం లేదు. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ విరమణ చేసిన, బదిలీపై వెళ్లిన అధికారుల స్థానంలో కొత్త అధికారులను ఈ జిల్లాకి బదిలీ చేసింది. వారు జిల్లాకు రావడానికి మొహం చాటేస్తున్నారు. ప్రభుత్వ బదిలీ ఉత్తర్వులు బుట్టదాఖలు అవుతున్నాయి. రాజకీయ పలుకుబడి ఉపయోగించి పైరవీలు చేసుకుని జిల్లాకు టాటా చెపుతున్నారు.

- ఇటీవల డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా జిల్లాకు డిఆర్‌ఒని నియమించారు. అయితే ఆయన ఇక్కడకు బదిలీపై రావడానికి ఇష్టం లేక రాలేదు.
- జిల్లా పంచాయతీ అధికారి కొద్ది నెలల క్రితం ఉద్యోగ విరమణ చేయడంతో ఖాళీగా ఉంది. డ్వామా పీడీ రామచంద్రరావు ఇన్‌ఛార్జి డిపిఒ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాల్సిన పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు జిల్లా అధికారులుగా ఇన్‌ఛార్జులే వ్యవహరిస్తున్నారు. ఈ మూడు శాఖల్లో ఎఇ, డిఇల కొరత తీవ్రంగా ఉంది.
- కీలకమైన గృహనిర్మాణ శాఖలో ప్రాజెక్టు డైరెక్టర్, ఇఇ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ శాఖలోనూ ఎఇ, డిఇల కొరత వేధిస్తోంది.
- పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల్లో కీలకమైన అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పిఒలుగా ఇన్‌ఛార్జులే బాధ్యతలు నిర్వహిస్తున్నారు.
- పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గిరిజన సంక్షేమ డిడిగా సాంఘిక సంక్షేమ డిడి గయాజుద్దీన్ వ్యవహరిస్తున్నారు.
- కార్యాలయ సూపరింటెండెంట్‌గా సహాయ గిరిజన సంక్షేమ అధికారి కె.శ్రీనివాసరావు పని చేస్తున్నారు.

ఇలా జిల్లాలో కీలకమైన శాఖల అధికారులు లేకపోవడంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు మందగమనంలో నడుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.

సబ్ కలెక్టర్‌పై భారం

ఆయనో యువ ఐఎఎస్ అధికారి. పేరు అశుతోష్ శ్రీవాత్సవ. కొద్ది నెలల క్రితమే ఆయన జిల్లాలో పార్వతీపురం సబ్‌సబ్ కలెక్టర్‌గా చేరారు. అప్పటికే కీలకమైన ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పోస్ట్ ఖాళీగా ఉండడం తో ప్రభుత్వం ఆయనకు ఆ బాధ్యతలు కూడా అప్పగించింది. ఇటు సబ్ కలెక్టర్, అటు ఐటిడిఎ పిఒగా రెండూ కీలకమైన విభిన్న శాఖలకు సంబంధించిన బాధ్యతలు. రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖలను ఒకే అధికారిగా బాధ్యతలను ఎక్కువ కాలం నిర్వహించడం ఇబ్బందికరమైన విషయమే. అయినా యువ అధికారి కావడంతో ఆయన శక్తివంచన లేకుండా పని చేస్తున్నారు. ఇప్పుడు మరో మూడు శాఖల బాధ్యతలు కూడా ఆయనే నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. జిల్లాలో డిఆర్‌ఒ పోస్ట్ చాలా కీలకమైంది. డిఆర్‌ఒ ఇన్‌ఛార్జి బాధ్యతలు కూడా అశుతోష్ శ్రీవాత్సవ నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేసిన డిఆర్‌ఒ కేశవ్ నాయుడుకు అనంతపురం బదిలీ కావడంతో ఆయనను రిలీవ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో అనివార్యంగా డిఆర్‌ఒ బాధ్యతలు కూడా సబ్ కలెక్టర్ అశుతోష్‌కే అప్పగించాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ మూడు కీలకమైన బాధ్యతలే కాకుండా కెఆర్‌సిసి డిప్యూటీ కలెక్టర్, ఎల్‌టిఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాధ్యతలు కూడా ఆయనే నిర్వహిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం జిల్లా జాయింట్ కలెక్టర్ శోభిక పది రోజుల సెలవుపై వెళ్లడంతో ఆ బాధ్యతలు కూడా ఆయనే నిర్వహించారు. రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖలనేవి రెండు భిన్నమైన శాఖలు. దీంతో ఒకే అధికారి ఎక్కువ కాలం బాధ్యతలు నిర్వహించడం వల్ల ఏ శాఖకూ సంతృప్తికరమైన సేవలు అందించలేని పరిస్థితి కనిపిస్తోంది. అయినా ప్రస్తుతం జిల్లాలో ఉన్న యువ ఐఎఎస్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ సవ్యసాచిలా విధులు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు.



సబ్‌కలెక్టర్ అశుతోష్

జనవరి 27,28న శంబర జాతర

ప్రజాశక్తి-మక్కువ

ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారి జాతర జనవరి 27, 28, 29వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ వివి సూర్యనారాయణ వెల్లడించారు. ఆదివారం అమ్మవారి చదురుగుడిలో స్థానిక పెద్దలు, ఆలయ కమిటీతో సమావేశం నిర్వహించారు. అందరి సమక్షంలో జాతర తేదీలను నిర్ణయించారు. 10 వారాల పాటు జరిగే జాతర ఘనంగా నిర్వహించాలని, అందుకోసం అందరూ సహకరించాలని ఇఒ కోరారు. మారు జాతర ఫిబ్రవరి 4న నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏప్రిల్ ఒకటో తేదీన చండీ హెూమం, మహా అన్నదాన కార్యక్రమంతో 10 వారాల జాతర ముగింపు చేస్తున్నట్లు ఈ సందర్భంగా నిర్ణయించారు. సమావేశంలో ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ దాలినాయుడు, మావుడి మాజీ సర్పంచ్ ఎ.తిరుపతిరావు, స్థానిక ఉపసర్పంచ్ ఎ.వెంకటరమణ, ఎంపిటిసి సభ్యులు పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

శంబర జాతర వివరాలను వెల్లడిస్తున్న ఇఒ సూర్యనారాయణ

ధర్నా చేస్తున్న 104 ఉద్యోగులు, యూనియన్ నాయకులు

104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

కలెక్టరేట్ ఎదుట 104 సిబ్బంది ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ ఆదివారం కలెక్టరేట్ ఎదుట ఎపి 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు వై.మన్మథరావు, డి.ఆనందరావు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ జెఎసి జిల్లా కన్వీనర్ బివి రమణ మాట్లాడుతూ 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత 104 సేవలను అరబిందో సంస్థకు అప్పగించిందని తెలిపారు. దీనివల్ల 104 సేవల నాణ్యత లోపించిందని చెప్పారు. ఒక్కో 104 వాహనానికి నెలకు సరాసరి రూ.50 వేల ఖర్చుతో చేపట్టే నిర్వహణను అరబిందో సంస్థకు రూ.1.20 లక్షలకు కాంట్రాక్టుకు అప్పగించారని తెలిపారు. దీనివల్ల రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం అయిందని విమర్శించారు. అందువల్ల 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్‌చేశారు. అందులో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇచ్చి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ ఫిట్నెస్ ప్రతి ఏటా చేయించాలని, కానీ ఇన్సూరెన్స్, ఫిట్నెస్‌ను అరబిందో సంస్థ చేయించలేదని తెలిపారు. దీనివల్ల అనేకమంది ప్రమాదాలకు గురై మరణిస్తున్నా పరిహారం పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇందులో పని చేస్తున్న సిబ్బంది అక్రమ కేసులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

కార్మికులకు చెల్లించాల్సిన పిఎఫ్‌లో సగం యాజమాన్యం చెల్లించాల్సి ఉన్నా.. అవేవీ చేయడం లేదన్నారు. మూడు నెలల జీతాలు బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ సౌకర్యం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ సమస్యలపై ప్రభుత్వానికి విన్నవించేందుకు ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 104 ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో 104 ఎంఎంయు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎ.సోమినాయుడు, సిహెచ్ ప్రసాద రావు, ఎం.జగదీష్, బి.వి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణకు కమిటీ

ఆదేశించిన ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి-పార్వతీపురం

జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థి నిమ్మక జీవన్ కుమార్ మృతి చెందడంపై విచారణకు ముగ్గురు అధికారులతో కమిటీని నియమించారు. ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాత్సవ శనివారం పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. విద్యార్థి జీవన్ కుమార్ మృతిపై విచారణ నిర్వహిస్తామని చెప్పారు. ఈ మేరకు ఐటిడిఎ పరిధిలోని డిప్యూటీ డిప్యూటీ డిఇఒ మోహన్ రాయుడు, డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ పద్మావతి, డిడి గయాజుద్దీన్‌తో కమిటీని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ విచారణ జరిపి నివేదిక అందించాలని ఆదేశించారు. నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

విద్యార్థుల మరణాలపై అసెంబ్లీలో చర్చించాలి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాలపై సోమవారం నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పి.రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్రలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులు పదుల సంఖ్యలో అనారోగ్యంతో మరణించారని చెప్పారు. ఈ మరణాలకు మూలకారణాలను కనుక్కొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం, వాచ్ వుమెన్, కుక్, ఇతర బోధనేతర సిబ్బంది నియామకం చేపట్టాలని కోరారు.

తగ్గించిన ఆవుపాల సేకరణ ధర పెంచాలని

29న చలో విశాఖ డెయిరీ

ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాశక్తి-పార్వతీపురం

విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు సేకరణ ధరను పెంచాలని ఈ నెల 29న చలో విశాఖ డెయిరీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం పార్వతీపురంలోని సుందరయ్య భవనంలో జిల్లా పాల రైతుల సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతుకు పాల ధర గిట్టుబాటు కావడం లేదన్నారు. గడ్డి, దాణా, పశువైద్యం, కృత్రిమ గర్భధారణ అన్నిటికీ ధరలు పెరిగాయని తెలిపారు. పెరిగిన ఖర్చుల నిష్పత్తిలో పాల సేకరణ ధర పెంచాలని అడుగుతున్నా, రైతు కోరికను పట్టించుకోని యాజమాన్యం ఇప్పటివరకు ఉన్న ధరను కూడా తగ్గించడం మరీ అన్యాయమన్నారు. తగ్గించిన పాల ధర పెంచాలని పాల రైతులు పెద్ద సంఖ్యలో విశాఖ డెయిరీ ముందు అక్టోబర్ 29న ధర్నా చేస్తే, డెయిరీ జిఎం వచ్చి బోర్డు మీటింగ్ వేసి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. నేడు మాట తప్పి తగ్గించిన ధరలతోనే పాల బిల్లులు వేస్తున్నారని, పాల రైతాంగం ఐక్యతతో ఈ దురాగతాన్ని ఎదుర్కోవాలని పిలుఉనిచ్చారు. విశాఖ డెయిరీకి 7 జిల్లాల నుంచి సుమారు 3.5 లక్షల మంది రైతులు రోజుకు 9 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారని తెలిపారు. పాల రైతుల చెమట కష్టంతో అభివృద్ధి చెందిన విశాఖ డెయిరీ వేలకోట్ల ఆస్తులు కూడబెట్టుకుంటున్నా, ఈ అభివృద్ధిలో వచ్చిన ఫలాలు ఏవీ రైతుకు దక్కకుండా దారి మళ్లిస్తూ భారాలు మాత్రం రైతులపై వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతుల నుంచి కొనుగులు చేస్తున్న, జనాలకు విక్రయిస్తున్న పాల ధరల మధ్య లీటరుకు రూ.20 నుంచి 24 వరకు వ్యత్యాసం ఉందన్నారు. నిర్వహణ ఖర్చులు లీటరుకు రూ.8 నుండి రూ.10 తీసినా, రూ.12కు పైగా మిగులు ఉంటుందని చెప్పారు. విశాఖ డెయిరీలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లుగా పత్రికల్లో వార్తలు వస్తున్నాయని, వాటిపైన విచారణ జరిపి నిగ్గుతేల్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. తగ్గించిన ఆవు పాల ధర పునరుద్ధరించాలని, సేకరణ ధర, అమ్మకం ధరకి ఉన్న వ్యత్యాసంలో రూ.10 రైతుకు కలపాలని కోరారు. రైతుకు ఇచ్చే పాలు ధరలో తగ్గించి బోనస్ ఇవ్వడం కాకుండా, డెయిరీ లాభాల నుంచి ప్రతి 4 నెలలకు ఒకసారి బోనస్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆవు పాలు లీటరుకు కనీస ధర రూ.50, గేదె పాలుకు రూ.80 ఇవ్వాలని, దాణా రాయితీ 75 శాతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై ఈ నెల 29న గాజువాకలోని విశాఖ డెయిరీ కేంద్రం వద్ద జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున రైతులందరూ కదలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, గేదెల సత్యనారాయణ, పాల రైతులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ

ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకుల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై ప్రజాపోరు

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ప్రజాశక్తి-పార్వతీపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరు చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ఈ నెల 14న జిల్లా కలెక్టరు కార్యాలయం, మండల కార్యాలయాల నిర్వహించనున్న ధర్నా ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం పట్టణ కమిటీ సమావేశంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్నాయని చెప్పారు. నిరుద్యోగం పెరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. నియంతృత్వాన్ని అమలు చేయటానికి రాజ్యాంగ విరుద్ధంగా జమిలి ఎన్నికల నిర్వహణను సిపిఎం వ్యతిరేకిస్తుందని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటు కంపెనీలకు అమ్మకం ఆపాలని, మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఆపాలని డిమాండ్ చేశారు. వీటిపై ఈ నెల 8 నుంచి 13 వరకు ఇంటింటి ప్రచారం, 14న కలెక్టరేట్, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి జి.వెంకటరమణ, నాయకులు ఆర్.శ్రీదేవి, సంచాన ఉమామహేశ్వరరావు, బంకురు సూరిబాబు, పడాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేశాయ్

కొమరాడ మండలంలోకి ప్రవేశించిన ఏనుగుల గుంపు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మన్యం జిల్లాలో రైతులు, గిరిజనులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ఏనుగుల గుంపు మళ్లీ జిల్లాలోకి ప్రవేశించింది. గత నెలలుగా పార్వతీపురం మండలంలో ప్రవేశించిన ఏనుగులు.. పంటలను నాశనం చేసి, రైతులకు తీవ్ర నష్టం మిగిల్చాయి. రెండు రోజుల క్రితం ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతానికి చేరుకున్న ఏనుగులు.. ఒడిశాలోకి ప్రవేశిస్తాయని అంతా భావించారు. ఏనుగులను ఎఒబి సరిహద్దు దాటించడానికి అటవీ శాఖ అధికారులు కూడా ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోయింది. పార్వతీపురం మండలాన్ని వీడి పెద్దమరికి మీదుగా ఆదివారం కొమరాడ మండలంలోని నందపురం గ్రామం వైపు వెళ్లాయి. గత రెండు రోజులుగా పార్వతీపురం మండలంలోని అడ్డూరువలస, పిట్టలవలస గ్రామాలలో సంచరించి నాశనం చేసిన వరి పంటకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

పెద్దమరికి, నందపురం గ్రామాల మధ్య తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

నేడు వైద్యారోగ్య శాఖ కమిషనర్ రాక

ప్రజాశక్తి-పార్వతీపురం

వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వి.కరుణ సోమవారం జిల్లాకు రానున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరోగ్య సేవలను మరింత మెరుగు పరిచేందుకు రాష్ట్ర స్థాయి అధికారులు జిల్లా పర్యటన చేయనున్నారని డిఎంహెచ్‌ఒ విజయ పార్వతి తెలిపారు. కమిషనర్ వి.కరుణ, రాష్ట్ర స్థాయి జాయింట్ డైరెక్టర్లు సోమ, మంగళవారాల్లో జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను సందర్శించనున్నట్లు చెప్పారు. ఈ పర్యటనలో ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మందులు, పరికరాలు, సిబ్బంది సమర్థత వంటి అంశాలను పరిశీలించి, అవసరమైన మెరుగుదలకు సంబంధించిన సూచనలు ఇస్తారని తెలిపారు. ఈ పర్యవేక్షణ ద్వారా జిల్లా ప్రజలకు మరింత నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడానికి అవసరమైన చర్యలు చేపట్టనున్నారని వెల్లడించారు. ఈ పర్యటన జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ పర్యవేక్షణలో గుర్తించిన సమస్యలను పరిష్కరించి, జిల్లాలో ఆరోగ్య రంగంలో మరింత సమర్థవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ఇన్ ఛార్జ్ అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వినోద్ కుమార్ తెలిపారు.

ఇదీ 13ఎల్ కాల్వ దుస్థితి

నాడు పొలాలకు రాని నీరు

నేడు ఇళ్లల్లోకి వచ్చింది చూడు

కోన గ్రామంలో ఇళ్లల్లోకి చేరిన నీరు

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని వెంగళరాయ సాగర్ పరిధిలోని 13 ఎల్ కాలువలో నీటి ప్రవాహ స్థితి చూస్తే విచిత్రంగా ఉంటుంది. ఖరీఫ్ కాలంలో రైతులు అష్టకష్టాలు పడినా ఒక్క నీటి బొట్టు కూడా ప్రవహించని ఈ కాలువలో ఖరీఫ్ చివరి అంకంలో మాత్రం మిగులు జలాలంతా అందులో ప్రవహించడంతో రైతులు ఆగ్రహానికి గురవుతున్నారు. మిగులు నీరు వృథాగా కాలువలకు విడిచిపెట్టడం వల్ల ఆయకట్టు శివారు గ్రామాలైన కోన, గోపాలపురం ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కాలువ నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల వృథాగా వస్తున్న నీరు కాలనీలోకి చేరడంతో ప్రజల అవస్థలు పడుతున్నారు. ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము అవస్థలు పడాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి 13ఎల్ కాలువలోకి వృథా నీరు రాకుండా అరికట్టాలని కోరుతున్నారు. మరోవైపు వరి చేను కోతలు కోసే సమయంలో ఇలా నీటి ప్రవాహం చేరి పంట నాశనం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇంటి చుట్టూ చేరిన నీటిని చూపిస్తున్న మహిళ

పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతివ్వాలి

ప్రజాశక్తి-సీతంపేట

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కె.విజయగౌరికి ప్రభుత్వ, ప్రయివేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు మద్దతు ఇవ్వాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరికి భాస్కరరావు కోరారు. ఆదివారం సీతంపేటలో యుటిఎఫ్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఈ నెల 23వ తేదీన ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేయనుందని తెలిపారు. ఈ లిస్టులో చేర్పులకు, మార్పులకు అవకాశం ఉంటుందని చెప్పారు. మళ్లీ నవంబర్ 24 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు మరోసారి టీచర్ ఓటర్లను నమోదు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కుండంగి క్రిష్ణారావు, భామిని మండల అధ్యక్షులు ఈగల తిరుపతరావు, సీతంపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.ఆనందరావు, బి.పకీరు, జిల్లా కౌన్సిలర్ పాలక కృష్ణారావు, దండు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

హెల్మెట్‌తో ప్రాణరక్షణ

ప్రజాశక్తి-సీతానగరం

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలు జరిగే సమయంలో ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చని ఎస్ఐ ఎం.రాజేష్ తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని పెదభోగిలి పంచాయతీ పరిధిలో హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహన చోదకులతోపాటు యువకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్‌కు ఉన్న క్లిప్పును కచ్చితంగా ఉపయోగించాలన్నారు. అప్పుడే రోడ్డు ప్రమాదాల నుంచి సురక్షితంగా బయట పడవచ్చని తెలిపారు. రహదారి ప్రమాదాలకు ప్రధానంగా నిర్లక్ష్యం, అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడమే కారణమన్నారు. మోటార్ వెహికల్ చట్టంలోని నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఓటర్ల నమోదు కార్యక్రమంలో యువతీ యువకులు చురుగ్గా పాల్గొన్నారు. తమ ఓటు హక్కును నమోదు చేయించుకున్నారు. పోలింగ్ బూత్ 74, 75లో ఏర్పాటుచేసిన ఓటరు నమోదు కేంద్రంలో బిఎల్ఒ భాస్కరరావు, మహిళా పోలీసు లక్ష్మి.. 18 ఏళ్లు నిండిన వారితో ఓటు హక్కు చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

వీరఘట్టంలో చలిపులి

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో గత మూడు రోజులుగా చలి తీవ్రత అధికమైంది. ఉదయం 8 గంటల వరకు మంచుదుప్పటి కమ్మేస్తోంది. వృద్ధులు, యువత వేకువ జామున లేచి చలిమంట వేసుకుంటున్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని చెముడుగూడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి కిమిడి భూషణ ఆధ్వర్యంలో గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. ఘన జీవామృతాన్ని మహిళా రైతులతో సామూహికంగా చేయించారు. జీడి మామిడి తోటల్లో భూసారం పెంచుటకు ఘనజీవామృతం ప్రాధాన్యత వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రకృతి వ్యవసాయ పంటలను పండించాలని రైతులకు సూచించారు.

ఆదివాసీ జెఎసి కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. జెఎసి చైర్మన్ కె.ధర్మారావు ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా హిమరక రామస్వామి, ఉపాధ్యక్షులుగా సాయికుమార్, ప్రధాన కార్యదర్శిగా సవర చిరంజీవులు, ఉపకార్యదర్శిగా తిరుపతిరావుగా, సహాయ కార్యదర్శిగా లక్ష్మణ్, మీడియా నాయకులు రామ్మోహన్‌రావుతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

అటవీశాఖ అమరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్ర అటవీశాఖ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కురుపాంలో అమరులకు ఘననివాళులర్పించారు. అటవీశాఖ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు ఆ శాఖ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారి సూర్యప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : అటవీ శాఖ అమరవీరుల దినోత్సవాన్ని పార్వతీపురం అరణ్య భవన్‌లో ఆదివారం నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణ విభాగం రేంజర్ మణికంఠ ఆధ్వర్యంలో అమరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫారెస్టర్ మనోజ్ కుమార్, శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వమే బీమా చేయించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వమే బీమా చేయించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఎంతోమంది విద్యార్థులు మరణిస్తున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులు అనాథలు అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం బీమా చేయించడం వల్ల తల్లిదండ్రులకు కొంత మేరకు ఆర్థిక సహాయం చేకూరుతుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించాలని, ఎఎన్ఎంలను ఎఎన్ఎంలను నియమించాలని కోరారు. వైద్య ఖర్చుల నిమిత్తం ప్రధానోపాధ్యాయులకు కొంత మొత్తం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు పింఛనుదారుల సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం సబ్ ట్రెజరరీ పరిధిలో ప్రభుత్వ పింఛనుదారుల సమావేశాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.గణపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. బెలగాంలో రైతుబజారు వెనుక ఉన్న ప్రభుత్వ పింఛనుదారుల సమావేశ మందిరంలో ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు.

పార్కులో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు కావడం, అందులో కార్తీక మాసం కావడంతో ఒక ప్రత్యేకత సంచరించుకుంది. జిల్లా నలుమూల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చారు. పార్కుల ఉన్న అందాలను ఆస్వాదించారు. యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. జలవిహార్ వద్ద బోటు షికారు చేశారు. ఆకాశంలో స్కైసైకిల్ ఎక్కి చక్కర్లు కొట్టారు. చిన్నారులు కమాండో నెట్‌తో ఆడుకున్నారు. అనంతరం మెట్టగూడ జలపాతాన్ని సందర్శించిన పర్యాటకులు జలకాలాడారు. ఆడలి వ్యూ పాయింట్‌ను సందర్శించి ప్రకృతి అందాలతో కనువిందు చేసుకున్నారు.

జలవిహార్‌లో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

సుదీర్ఘకాలం నిలిచేలా కోర్టు భవనాల నిర్మాణం

- న్యాయవాదులు కమిటీగా ఏర్పడి భవనాల నిర్మాణంపై బాధ్యత తీసుకోవాలి
- బార్ అసోసియేషన్ ఐక్యత, పట్టుదల వల్లే నూతన కోర్టు భవనాలు మంజూరు
- యువ న్యాయవాదులే నిర్వహణ బాధ్యత తీసుకోవాలి
- కృతజ్ఞత సత్కార సభలో హైకోర్టు న్యాయమూర్తులు
- పదిమంది హైకోర్టు న్యాయమూర్తులను సత్కరించిన బార్ అసోసియేషన్

జిల్లా పోర్టుపోలియో జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్ రావును సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ లేనివిధంగా విజయనగరం జిల్లా కోర్టుకు ఆధునిక వసతులతో కూడిన నూతన భవన సముదాయం మంజూరైందని, సుదీర్ఘకాలం పాటు నిలిచేలా భవన నిర్మాణం సమయంలోనే న్యాయవాదులు బాధ్యత తీసుకోవాలని పలువురు హైకోర్టు న్యాయమూర్తులు సూచించారు. ముఖ్యంగా యువ న్యాయవాదులే ఈ భవనాల్లో న్యాయవాద వృత్తిలో ప్రాక్టీస్ చేయనున్నందున వారిపైనే భవనాల నిర్మాణం, నిర్వహణ బాధ్యత అధికంగా ఉంటుందన్నారు. విజయనగరం బార్ అసోసియేషన్ చూపిన ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే నూతన భవనాల మంజూరు సాకారమయ్యిందని పేర్కొన్నారు. రాష్ట్రానికి న్యాయమూర్తులను అందించడంలో విజయనగరం ముందంజలో వుందన్నారు. విజయనగరం జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణం రూ.100 కోట్లతో మంజూరు చేసిన నేపథ్యంలో ఈ జిల్లాకు గతంలో అడ్మినిస్ట్రేటివ్ జడ్జిలుగా పనిచేసిన పలువురు న్యాయమూర్తులకు, జిల్లా వాసులైన హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృతజ్ఞత పూర్వక అభినందన సభ ఆదివారం నగరంలోని లీపేరడైజ్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.హరీష్ అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు న్యాయ మూర్తి జస్టిస్ దోనాడి రమేష్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ నైనాల జయసూర్య, జస్టిస్ కె.మన్మథరావు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జస్టిస్ బి.కృష్ణమోహన్, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి తదితరులను శాలువ, మొమెంటోతో విజయనగరం, విశాఖ, పార్వతీపురం జిల్లాల బార్ అసోసియేషన్ల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తర్లాడ రాజశేఖర్ రావు మాట్లాడుతూ కోర్టు భవనాల నిర్మాణం త్వరగా పూర్తయ్యేందుకు తన వంతుగా కృషి చేస్తాననన్నారు. మిగతా న్యాయమూర్తులు మాట్లాడుతూ వదిలివేయబడిన చెరువులో తేలికపాటి మట్టితో కూడిన నేలపై నిర్మించిన కారణంగానే గతంలో 30ఏళ్ల క్రితం నిర్మించిన కోర్టు భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. జిల్లా బార్ అసోసియేషన్ ధృడ సంకల్పంవల్లే ఈ ప్రాజెక్టు ఇంత త్వరగా కార్యరూపం దాల్చిందన్నారు. బార్ సభ్యుల కృషికి తన తోటి హైకోర్టు న్యాయమూర్తుల సహకారం లభించడంతోపాటు, జిల్లా వాసిగా సొంత జిల్లాకు న్యాయవ్యవస్థ పరిధిలో ఏదైనా చేయాలనే తన తపన తోడై భవనాల మంజూరు త్వరగా సాకారమైందన్నారు. ప్రస్తుత అవసరాలకు తగినట్టుగా న్యాయవ్యవస్థకు మౌళిక వసతులు కల్పించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే నిర్ణయించిందని తెలిపారు. ఈనేపథ్యంలోనే దెబ్బతిన్న పాత కోర్టు భవనాల స్థానంలో ఆధునిక వసతులతో కొత్తవి మంజూరు చేసేందుకు ప్రాధాన్య మిస్తున్నారని పేర్కొన్నారు. భవనాల నిర్మాణం నిర్ణీత సమయానికి పూర్తి కావాలంటే నిర్మాణ సంస్థతో పాటు బార్ అసోసియేషన్ కూడా బాధ్యత తీసుకోవలసి వుందన్నారు. కొన్ని వందల కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న ఈ భవనాన్ని పరిరక్షించుకొనే బాధ్యత న్యాయవాదులపైనే వుంటుందని చెప్పారు. న్యాయమూర్తులను గౌరవించడంలో, న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటంలో ఈ జిల్లా ఎప్పుడూ ముందంజలోనే నిలుస్తోందని అన్నారు. బార్ అసోసియేషన్ లో వున్న ఐక్యత, పట్టుదల, సంకల్పంతోనే కొత్త భవనాల మంజూరు సాధ్యమైందని అన్నారు. జిల్లా జడ్జి సాయికళ్యాణ్ చక్రవర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.హరీష్, న్యాయవాది కె.వి.ఎన్. తమ్మన్నశెట్టి తదితరులు కూడా మాట్లాడారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్‌జిందాల్ మాట్లాడుతూ జిల్లా కోర్టు నూతన భవనాల నిర్మాణం త్వరగా పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం తరపున తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరం జిల్లా విశిష్టతలు, ఇక్కడి ప్రముఖులతో కూడిన స్వల్ప నిడివి గల చిత్రాన్ని ప్రదర్శించారు. జిల్లా కోర్టు భవన నిర్మాణ విశేషాలతో కూడిన మరో చిత్రాన్ని కూడా ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు హాజరయ్యారు.

సరదాగా బైక్ తీసి.. అంతలోనే ప్రమాదానికి గురై..

- ముగ్గురు విద్యార్థులకు గాయాలు
- ఒకరిని కెజిహెచ్‌కు తరలింపు
- ఆలస్యంగా వెలుగులోకి సంఘటన

కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థి

ప్రజాశక్తి-మక్కువ

బైక్ సరదా ముగ్గురు విద్యార్థులను ప్రమాదంలోకి నెట్టింది. డోకిశిల వసతిగృహం సమీపంలో చోటుచేసుకున్న ఈ సంఘటన నాలుగు రోజులు ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ప్రమాదంలో మండలంలోని అనసభద్ర ఏకలవ్య పాఠశాల విద్యార్థులు డి.రామకృష్ణ, సిహెచ్.సంతోష్, బి.సుశాంత్ గాయపడ్డారు. శనివారం విద్యార్థి రామకృష్ణను విశాఖలోని కెజిహెచ్‌కు తరలించారు. ప్రిన్సిపల్ బి.ఎర్రినాయుడు కథనం ప్రకారం..

మండలంలోని అనసభద్ర ఏకలవ్య పాఠశాల పదో తరగతి, ఇంటర్ విద్యార్థులను పార్వతీపురం మండలం డోకిశిల వసతిగృహానికి ఈ ఏడాది జూన్‌లో మార్చిన విషయం తెలిసిందే. అలా అనసభద్ర పాఠశాలకు చెందిన విద్యార్థులు డి.రామకృష్ణ, సిహెచ్.సంతోష్, బి.సుశాంత్ డోకిశిల వసతిగృహంలో ఉంటూ, పదో తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురు ఈ నెల ఆరో తేదీ రాత్రి 10 గంటల ప్రాంతంలో హాస్టల్ సమీపంలో ఉన్న ఓ బైకు తీసుకుని సరదాగా తిరిగి వద్దామనుకున్నారు. దీంతో బైక్ అదుపుతప్పి ముగ్గురు గాయపడ్డారు. ఇందులో రామకృష్ణ చెయ్యి విరిగింది. సుశాంత్, సంతోష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద విషయాన్ని తప్పించుకునేందుకు అదేరోజు రాత్రి ఎఎన్ఎం వద్ద కట్టుకథ అల్లారు. రామకృష్ణ దుస్తులు ఆరబెడుతుండగా పడిపోయాడని, ఆయన్ను డోకిశిల తీసుకు వెళ్లినట్లు హాస్టల్లో ఉంటున్న ఎఎన్ఎంకు విద్యార్థి సంతోష్ తెలియజేశాడు. దీంతో ఆమె పిహెచ్‌సికి వెళ్లి విద్యార్థులను నిలదీయగా అసలు విషయాన్ని బయటపెట్టారు. దీంతో ముగ్గురిని పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అందులో రామకృష్ణను శుక్రవారం విశాఖలోని కెజిహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ఘటన జరిగిన నాలుగు రోజుల తరువాత వెలుగులోకి రావడం గమనార్హం. ఈ సంఘటన బయటకు రాకుండా చూసేందుకు ప్రయత్నించినట్లు సమాచారం.

డోకిశిల సిబ్బంది అంతా రాత్రి తొమ్మిది గంటలకే వెళ్లిపోతున్నారు. హౌస్ ఉపాధ్యాయులకు స్థానికంగా వసతి సౌకర్యం లేకపోవడంతో వారు కూడా వెళ్లిపోయారు. రాత్రి వేళలో విద్యార్థులకు బైక్ ఎలా వచ్చింది? హాస్టల్ నుంచి ఎలా వెళ్లారనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సమస్యలపై విద్యార్థులు స్పందిస్తేనే పరిష్కారం

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

ఆశ్రమ పాఠశాలలో గిరిజన విద్యార్థుల మరణాలను తగ్గించాలంటే విద్యార్థులు తమ సమస్యలపై ప్రతిఒక్కరూ స్పందించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కోలక మల్లేష్ అన్నారు. ఆదివారం మండలంలోని టికె జమ్ము గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయన విద్యార్థులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురుపాం నియోజకవర్గంలో ఏడుగురు గిరిజన విద్యార్థులు మరణించారని తెలిపారు. దీనిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి, వారి కుటుంబాలకు న్యాయం చేయకుండా తాత్సారం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులు ఆశ్రమ పాఠశాలలో ఉంటూ వారి ఆరోగ్యం పట్ల, వసతిగృహంలో ఇస్తున్న మెనూ పట్ల అశ్రద్ధ చేయకుండా సమస్యలపై చర్చించాలన్నారు. ప్రతీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తే తగు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ గిరిజనులకు ఇవ్వాల్సిందే

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

జియ్యమ్మవలస ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్‌ను గిరిజనులకే కేటాయించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం బొడ్డువలసలో గిరిజనులతో కలిసి ఆయన మాట్లాడారు. జియ్యమ్మవలసలో ఇదివరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన తోటపల్లి సుజాత అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో రెండేళ్ల క్రితం విధుల నుండి తొలగించారని తెలిపారు. అప్పటి నుండి టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా పనులు చేయించారని తెలిపారు. ఇటీవల కొత్తగా బిసికి చెందిన వారిని ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమిస్తున్నట్లు తెలిసిందని చెప్పారు. ఆ పోస్టును గిరిజనులకే కేటాయించాలని, గిరిజనేతరులకు కేటాయించడమంటే గిరిజనులకు అన్యాయం చేయడమేనని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బి.మోహన్ రావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తిరుపతిరావు

హామీలను తక్షణమే అమలు చేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, వాకాడ ఇందిరా డిమాండ్ చేశారు. కొమరాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిపిఎం మండల మహాసభ ఆదివారం జరిగింది. సిపిఎం జెండాను సీనియర్ నాయకులు పి.సింహాచలం ఆవిష్కరించారు. కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం సభలో వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా పేద ప్రజలకు జీవన పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా చేపడుతున్న ప్రజాపోరును విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏనుగుల సమస్య, పూర్ణపాడు-లాబేసు వంతెన, తోటపల్లి, గుమ్మడిగెడ్డ, జంఝావతి, వనకాబడి రిజర్వాయర్ సమస్యలపై తీర్మానాలు చేశారు. అనంతరం సిపిఎం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మూడో సారి మండల కార్యదర్శిగా కొల్లి సాంబమూర్తి ఎన్నికయ్యారు. మండల కమిటీ సభ్యులుగా హెచ్.రామారావు, బి.మధు, కె.సంగమ్మ, మాణిక్యం, మండంగి మధు, మీసాలు సూర్యనారాయణ, వెంకటేష్ ఎన్నికయ్యారు.

నిత్యావసరాల ధరలు, నిరుద్యోగంపై ప్రజాపోరు

బలిజిపేటలో ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-బలిజిపేట

ప్రజా సమస్యల పరిష్కారానికి చేపడుతున్న ప్రజాపోరును విజయవంతం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి వై.మన్మథరావు కోరారు. ఈ మేరకు ఆదివారం బలిజిపేటలో ప్రజాపోరు పోస్టర్‌ను విడుదల చేసి, ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలని, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్‌చేశారు. ఈ నెల 14న తహశీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భానుమూర్తి, బలరాం, సాంబమూర్తి, వేణు, వెంకటస్వామి, నల్ల ఈశ్వరరావు, త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు రూరల్ : నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగ సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో మండలంలో ఎగువసెంబి, దిగువసెంబి, కుడకారు గ్రామాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులపై మోయలేనంత భారాలు పడుతున్నాయని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలకు హద్దే లేకుండా పోయిందన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 14న తహశీల్దార్ కార్యాలయం చేపట్టే ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, మండల కమిటీ సభ్యులు గెమ్మెల జానకిరావు, తాడంగి చరణ్, తాడంగి సీతయ్య పాల్గొన్నారు.

విజయవంతం చేయాలని సిపిఎం ప్రచారం

సాలూరురూరల్.. ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

స్వచ్ఛ సుందర పార్వతీపురంలో 'జట్టు' సేవలు అభినందనీయం

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

చెత్త నిర్వహణను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

స్వచ్ఛ సుందర పార్వతీపురంలో జట్టు ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ కితాబిచ్చారు. ఆదివారం పట్టణంలో జట్టు ఆశ్రమం నిర్వహిస్తున్న చెత్త నిర్వహణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే మన ఆలోచనలు కూడా మంచిగా ఉంటాయని, దాన్ని ఆచరణలో జట్టు ఫౌండేషన్ చూపిస్తోందని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వీటితో పాటు అనేక కార్యక్రమాలను చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అందులో భాగంగా వేస్ట్ మేనేజ్మెంటు కార్యక్రమం ద్వారా ఈ ఫౌండేషన్ నూరు శాతం అమలుచేయడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. జట్టు అనుసరిస్తున్న తీరు అభినంద నీయమని, ఇటువంటి కార్యక్రమాలు మిగిలిన వారికి స్ఫూర్తిగా నిలుస్తాయని కొనియాడారు. జట్టు ఆశ్రమం వ్యవస్థాపకులు వెనిగొండ్ల పద్మజమ్మ మాట్లాడుతూ స్వచ్ఛ సుందర పార్వతీపురం లక్ష్యంగా తమ ఆశ్రమం పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో డి.పారినాయుడు, సిహెచ్ పారినాయుడు, ఎ.కైలాసరావు, ఎ.ఈశ్వరరావు, ఎన్.హేమంత్, పవన్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని బహిష్కరించిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు

మండల సమావేశం బహిష్కరణ

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట మండల సర్వసభ్య సమావేశాన్ని సభ్యులు మూకుమ్మడిగా బహిష్కరించారు. స్థానిక వైటిసిలో ఆదివారం ఎంపిపి ఆదినారాయణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. అధికారులకు బదులుగా సిబ్బంది రావడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్ని శాఖల అధికారులు గైర్హాజరుకావడంపై మండిపడ్డారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించినప్పుడు ప్రోటోకాల్ పాటించడం లేదని నిలదీశారు. ప్రజా సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆగ్రహించారు. అనంతరం సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఉన్న సిబ్బందితో అధికారులు సమావేశాన్ని మమా అనిపించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ మాస, ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, తదితరులు పాల్గొన్నారు .

13న భామినిలో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై సదస్సు

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఈ నెల 13న భామిని ఆదర్శ పాఠశాలలో ఎస్‌సి, ఎస్‌టి చట్టాలపై విద్యార్థులకు సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి దశలో అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం జిల్లాల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులతో పాటు స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కొంచలో గ్రామసభ

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలో కొంచ గ్రామంలో సోమవారం భూ రీసర్వే సమస్యల పరిష్కార గ్రామసభను నిర్వహించనున్నట్లు తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.